
సాక్షి

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

సోమవారం ; 4 ; డిసెంబర్ ; 2023



సోమశిలలో 29.768 టీఎంసీలు

సోమశిల: సోమశిల జలాశయంలో ఆదివారం సాయంత్రానికి 29.768 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పైతట్టు ప్రాంతాల నుంచి 590 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	- రూ.65,400
22 క్యారెట్లు ఆర్నమెంట్ (గ్రా)	-రూ.5,873
3 శాతం జీఎస్టీతో.. -	రూ.6,049
నవర (8 గ్రా) -	రూ.48,392

గరిష్టం/కనిష్టం
27.2 /23.6

వాతావరణం

ఆదివారం గాలిలో తేమ 100 శాతం ఉంది. జిల్లావ్యాప్తంగా భారీ వర్షాలు కురిశాయి. సోమవారం కూడా జిల్లాలో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ తెలిపింది.

న్యూస్‌రీల్

95.1 శాతం పింఛన్ల పంపిణీ



చేజర్ల మండలం కోటితీర్థంలో దివ్యాంగురాలు జాహ్నవికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ సుమతి

నెల్లూరు(పొగతోట): జిల్లాలో వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ ప్రక్రియ కొనసాగుతోంది. మూడో రోజు ఆదివారం 95.1 శాతం మంది లబ్ధిదారులకు పింఛన్ కానుక నగదును వలంటీర్లు పంపిణీ చేశారు. జిల్లాలో మొత్తం 3,15,544 మంది లబ్ధిదారులకు పింఛన్ కానుక అందజేయాల్సి ఉండగా, 3,00,083 మందికి పింఛన్ నగదు అందజేశారు. ఈ నెల 5వ తేదీ వరకు పింఛన్ నగదు పంపిణీ చేయనున్నారు.

అత్యవసర ప్రయాణాలు మాత్రమే చేయండి



రవాణాశాఖ అధికారులతో మాట్లాడుతున్న డీటీసీ చందర్

నెల్లూరు(టౌన్): మిచాంగ్ తుపాను తీవ్రత కారణంగా జిల్లాలో ప్రజలు అత్యవసర ప్రయాణాలను మాత్రమే చేయాలని డీటీసీ బి.చందర్ సూచించారు. ఆదివారం ఆయన నెల్లూరులోని జిల్లా రవాణాశాఖ కార్యాలయంలో నెల్లూరు ఆర్టీఓ సిరిచందన, ఎంవీఐలు మురళీమోహన్, బాలమురళీకృష్ణ, కావలి ఆర్టీఓ సుధాకర్‌రెడ్డి, కందుకూరు ఎంవీఐ రఫీ, ఆత్మకూరు ఎంవీఐ రాములతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానంగా ఆటోల్లో ప్రయాణాలను తగ్గించుకోవాలని సూచించారు. ప్రమాదకరమైన వాగులున్న రహదారులను గమనించి ప్రయాణం చేయాలన్నారు. ఆయా ప్రాంతాల్లో ఉన్న రవాణా అధికారులు అందుబాటులో ఉండాలని ఆదేశించారు.

నేటి స్పందన రద్దు

నెల్లూరు(క్రైమ్): మిచాంగ్ తుపాను నేపథ్యంలో సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జరగాల్సిన స్పందన కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు జిల్లా పోలీసు కార్యాలయం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. ప్రజలందరూ ఈ విషయాన్ని గమనించాలని, తుపాను నేపథ్యంలో ఇళ్లు విడిచి బయటకు రావొద్దని సూచించింది.

కుండపోత



రామలింగాపురం అండర్ బ్రిడ్జ్ వద్ద వర్షపునీటిలో ఆగిపోయిన ఆర్టీసీ బస్సు



ఆత్మకూరు బస్టాండ్ వద్ద అండర్ బ్రిడ్జిలో వర్షపు నీరు చేరడంతో ఫుట్‌పాత్‌పై వెళుతున్న ప్రజలు



వనంతోపు సెంటర్ వద్ద రోడ్డుకిరువైపులా స్తంభించిన ట్రాఫిక్

- తరుముకొస్తున్న మిచాంగ్ తుపాను
- జిల్లాలో ఎడతెరిపిలేని భారీ వర్షం
- లోతట్టు ప్రాంతాలు జలమయం
- తీర ప్రాంత ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలింపు
- కృష్ణపట్నం పోర్టులో 1వ నంబర్ ప్రమాద హెచ్చరిక జారీ
- తీర ప్రాంతాల్లో తుపాను పరిస్థితిని పరిశీలించిన కలెక్టర్, జేసీ
- అప్రమత్తతను ప్రకటించిన జిల్లా యంత్రాంగం
- కంట్రోల్ రూంల ద్వారా పర్యవేక్షణ
- నేడు విద్యాసంస్థలకు సెలవు

మిచాంగ్ తుపాను జిల్లాను ముంచేస్తోంది. దీని ప్రభావంతో ఆదివారం జిల్లాలో కుండపోతగా వర్షం కురిసింది. జిల్లాలోని సముద్ర తీరంలో ఈదురుగాలులతో కూడిన ఎడతెరిపి లేని వర్షం కురుస్తోంది. కడలి కల్లోలంగా మారి కెరటాలు ఉవ్వెత్తున ఎగసిపడుతున్నాయి. వర్షం, గాలుల ధాటికి చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. భారీ వర్షాల నేపథ్యంలో ఆదివారం నెల్లూరు నగరంతోపాటు జిల్లాలో జనజీవనం స్తంభించింది. నెల్లూరులోని అండర్ బ్రిడ్జిల వద్ద వరద నీరు చేరడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమై ప్రజలు ఇబ్బందులు పడ్డారు.





నెల్లూరు కేవీఆర్ పెట్రోల్ బంక్ సమీపంలో రోడ్డుపై ప్రవహిస్తున్న వర్షపునీటిలో వెళుతున్న వాహనాలు

నెల్లూరు(దర్గామిట్ట): మిచాంగ్ తుపాన్ ప్రభావంతో ఆదివారం జిల్లాలో ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది. సముద్ర తీర ప్రాంత మండలాలతోపాటు పలుచోట్ల ఈదురుగాలులతో కూడిన జడివాన మొదలైంది. చలిగాలులతోపాటు గాలి, వాన తోడవడంతో ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. శనివారం రాత్రి నుంచి నెల్లూరు నగరంలో కుండపోత వర్షం కురిసింది. అనంతసాగరం, కలువాయి, పొదలకూరు, సంగం, బుచ్చిరెడ్డిపాళెం, కావలి, ఆత్మకూరుతోపాటు తీర ప్రాంత మండలాల్లో ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. వాతావరణశాఖ జిల్లాలో రెడ్ అలెర్ట్ ప్రకటించడంతో కలెక్టర్ ఎం.హరినారాయణన్ ఆధ్వర్యంలో అధికార యంత్రాంగం ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టింది. కృష్ణపట్నం పోర్టులో 1వ నంబర్ ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. జిల్లాలోని తీర ప్రాంతాల్లో పలుచోట్ల సముద్రం 10 నుంచి 30 మీటర్ల మేర ముందుకొచ్చింది. మించాంగ్ తుపాను తరుముకొస్తుండడంతో సముద్రం వైపు ఎవరూ వెళ్లకుండా నిషేధాజ్ఞలు జారీ చేశారు. జిల్లాలోని ప్రధానమైన మైపాడు, కోడూరు, తుమ్మలపెంట బీచ్‌లను మూసివేశారు. ఈ సందర్భంగా బీచ్‌లకు పర్యాటకులు రావద్దంటూ సూచనలు చేశారు.

పలు ప్రాంతాలు జలమయం

తుపాను ప్రభావంతో నెల్లూరు నగరంలో పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. ప్రధాన రహదారులు సైతం చెరువులను తలపించాయి.ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తుండడంతో నగరంలో జనజీవనం స్తంభించింది. ఆత్మకూరు బస్టాండ్ సమీపంలోని అండర్ బ్రిడ్జి, వీఆర్‌సీ సమీపంలోని అండర్ బ్రిడ్జి, విజయ మహల్ గేటు వద్ద గల బాక్స్‌టైప్ బ్రిడ్జి కింద వర్షపునీరు భారీగా చేరి రాకపోకలు స్తంభించాయి. వెంగళరావు నగర్‌లో ప్రధాన వీధులు సైతం జలమయమయ్యాయి. బాలాజీనగర్, తదితర ప్రాంతాల్లో ఇళ్లలోకి వర్షపునీరు చేరి ప్రజలు ఇబ్బందులు పడ్డారు.



నెల్లూరు బాలాజీ నగర్‌లో ఇంట్లోకి వచ్చిన వర్షపునీరు

తీర ప్రాంతాల్లో కలెక్టర్, జేసీ పర్యటన

తుపాను పరిస్థితిని స్వయంగా పరిశీలించేందుకు జిల్లాలోని సముద్ర తీర ప్రాంతాల్లో కలెక్టర్ ఎం.హరినారాయణన్ పర్యటించారు. భారీ వర్షాలు, ఈదురుగాలుల వల్ల తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మత్స్యకారులతో మాట్లాడి వారికి ధైర్యంగా ఉండేలా సూచనలు చేశారు. ప్రజలు సురక్షిత ప్రాంతాలకు, పునరావాస కేంద్రాలకు వెళ్లాలని సూచించారు. బకింగ్‌హామ్ కాలువ పరీవాహక ప్రాంతంలో ఉన్న గ్రామాల్లో ఎలాంటి ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశాలు ఇచ్చారు. నెల్లూరు నగరంలో లోతట్టు ప్రాంతాల పరిస్థితిపై అధికారులు పరిశీలించి అవసరమైన చోట పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. ఇందుకూరుపేట మండలం గంగపట్నం తదితర ప్రాంతాలను జాయింట్ కలెక్టర్ రోణంకి కూర్మనాథ్ పరిశీలించారు. అవసరమైన చోట పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. తీర ప్రాంతంలో మిచాంగ్ తుపాను వల్ల ఎలాంటి ఇబ్బందులు జరగకుండా ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో కోస్ట్ గార్డులు, పోలీసులు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. జిల్లాలో వాతావరణశాఖ రెడ్ అలెర్ట్ ప్రకటించడంతో సోమవారం విద్యాసంస్థలకు సెలవు ప్రకటించిన విషయం తెలిసిందే. ప్రజలు అవసరమైతే తప్ప బయటకు రాకూడదని అధికారులు సూచిస్తున్నారు.

జిల్లాలో 23.2 మి.మీ. వర్షపాతం

నెల్లూరు(దర్గామిట్ట): తుపాను ప్రభావంతో జిల్లాలో ఆదివారం సగటున 23.2 మి.మీ. వర్షపాతం నమోదైంది. గరిష్టంగా నెల్లూరురూరల్ మండలం 83.6 మి.మీ. వర్షపాతం నమోదైంది. కాగా ఇందుకూరుపేటలో 68.4 మి.మీ., నెల్లూరు అర్బన్‌లో 65.2, రాపూరులో 49.6, పొదలకూరులో 49.2, మనుబోలులో 48.2, విడవలూరులో 46.4, దగదర్తిలో 46.2, కొడవలూరులో 43.6, వెంకటాచలంలో 37.4, అల్లూరులో 34.8, ముత్తుకూరులో 34.2, తోటపల్లిగూడూరులో 33.2, బోగోలులో 29.2, సైదాపురంలో 25.6, బుచ్చిరెడ్డిపాళెంలో 22.8, కలువాయిలో 20.8, కోవూరులో 18.6, ఆత్మకూరులో 16.4, చేజర్లలో 15.2, కావలిలో 14.4, జలదంకిలో 13.4, సంగంలో 11.6, అనంతసాగరంలో 10 మి.మీ. చొప్పున వర్షపాతం నమోదైంది.

దృష్టి అంతా తీరంపైనే..

అల్లూరు/కావలి: మిచాంగ్ తుపాను వల్ల తక్షణమే ప్రభావం చూపించే సముద్ర తీరంలోని మత్స్యకార గ్రామాలపై అధికార యంత్రాంగం దృష్టి సారించింది. కలెక్టర్ హరినారాయణన్ స్వయంగా కావలి నియోజకవర్గంలోని అల్లూరు మండలం ఇస్కపల్లి మత్స్యకార గ్రామాన్ని ఆదివారం సందర్శించారు. నేరుగా సముద్ర తీరానికి వెళ్లి ఒడ్డున మత్స్యకారుల వేట సామగ్రి అయిన బోట్లు, వలలను పరిశీలించారు. వాటిని ఒడ్డుకు మరింత దూరంగా తరలించుకోవాలని, అలలు ఉధృతం అయితే కొట్టుకుపోయే ప్రమాదం ఉందని మత్స్యకారులకు సూచించారు. అలాగే రెవెన్యూ, పోలీసు శాఖలు మిగిలిన శాఖలతో సమన్వయం చేసుకొని ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు సన్నద్ధంగా ఉండాలని కలెక్టర్ వివిధ శాఖల అధికారులను ఆదేశించారు. తుపాను ప్రభావంతో తీరంలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, తీర గ్రామాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేలా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సహాయ, పునరావాస కేంద్రాలు, అక్కడ ఆహారం, తాగునీరు, మరుగుదొడ్లు వంటి వసతులు సమకూర్చుకోవాలని తెలిపారు. అలాగే విద్యుత్, రవాణా సదుపాయాలకు అవరోధాలు లేకుండా ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ఇదిలా ఉండగా కావలి రూరల్, బోగోలు, అల్లూరు మండలాల పరిధిలో 45 కిలోమీటర్ల మేర విస్తరించిన సముద్ర తీర ప్రాంతంలో 28 మత్స్యకార గ్రామాలు ఉన్నాయి. ఆయా గ్రామాల్లో 40 వేల మందికి పైగా జనాభా ఉన్నారు. వారి కోసం మూడు సహాయ శిబిరాలను ఏర్పాటు చేశారు. ఈ సహాయ శిబిరాలకు ఇప్పటి వరకు 200 మంది తరలించారు. కావలి ఆర్డీఓ వీకే శీనానాయక్ తహసీల్దార్లు, ఇతర రెవెన్యూ సిబ్బందితో కలిసి పరిస్థితులను పర్యవేక్షిస్తున్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ శీనానాయక్, తహసీల్దార్ చంద్రశేఖర్, ఎంపీడీఓ జ్యోతి, ఎంపీపీ శశిరేఖ తదితరులు పాల్గొన్నారు.



అల్లూరు మండలం ఇస్కపల్లి తీరంలో ప్రజలతో మాట్లాడుతున్న కలెక్టర్ హరినారాయణన్



బోగోలు మండలం తాటిచెట్లపాలెం వద్ద సముద్రంలో ఎగసిపడుతున్న కెరటాలు

నేలకొరిగిన 178 విద్యుత్ స్తంభాలు

- భారీ వర్షాలతో విద్యుత్ సంస్థకు రూ.35 లక్షల నష్టం

నెల్లూరు(వీఆర్సీసెంటర్): జిల్లావ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాలకు తోడు ఈదురుగాలులు వీయడంతో ఆదివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. దీంతో విద్యుత్‌శాఖకు నష్టం వాటిల్లడంతోపాటు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. జిల్లాలోని పలు ప్రాంతాల్లో 33 కేవీ విద్యుత్ స్తంభాలు 8, 11 కేవీ విద్యుత్ స్తంభాలు 72, ఎల్‌టీ విద్యుత్ స్తంభాలు 98 నేలకొరిగాయి. మొత్తం 178 విద్యుత్ స్తంభాలు నేలకొరగడంతో ఆ శాఖ సిబ్బంది వెంటనే మరమ్మతులు చేపట్టి 11 కేవీ విద్యుత్ స్తంభాలు 48, ఎల్‌టీ విద్యుత్ స్తంభాలు 50, 33 కేవీ అన్ని స్తంభాలను పునరుద్ధరించారు. ఈ పరిణామంతో జిల్లా విద్యుత్ శాఖకు రూ.35 లక్షల మేర నష్టం వాటిల్లిందని ఎస్ఈ విజయన్ తెలిపారు. ప్రధానంగా నెల్లూరు రూరల్, గూడూరు, నాయుడుపేట డివిజన్లలో నష్టం తీవ్రత ఎక్కువగా జరిగిందని, విద్యుత్ సిబ్బంది వెంటనే అప్రమత్తమై పునరుద్ధరణ చర్యలు చేపట్టినట్లు ఆయన తెలిపారు. తనతోపాటు విద్యుత్ శాఖ నోడల్ ఆఫీసర్స్ పునరుద్ధరణ చర్యలను పర్యవేక్షిస్తున్నామని తెలిపారు.



నెల్లూరులోని వెంకటేశ్వరపురం వద్ద నేలకూలిన విద్యుత్ స్తంభం

ప్రతి క్షణం అప్రమత్తంగా ఉండండి

- ఎస్పీ కె.తిరుమలేశ్వరరెడ్డి

కావలి: మిచాంగ్ తుపాను నేపథ్యంలో తీర గ్రామాల్లోని ప్రజలు ప్రతి క్షణం అప్రమత్తంగా ఉండాలని, అధికారులు ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఎస్పీ కె.తిరుమలేశ్వరరెడ్డి, ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అధికార యంత్రాంగానికి సూచించారు. ఆదివారం ఎస్పీ, ఎమ్మెల్యే మండలంలోని తుమ్మలపెంట సముద్రతీరంలో పర్యటించారు. ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ సిబ్బంది తీర గ్రామాల్లో పరిస్థితిని అంచనా వేయడంతోపాటు, లోతట్టు ప్రాంతాల్లో పరిస్థితిని తెలుసుకుంటూ ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. తుపాను ముప్పు తొలగే వరకు ఎవరూ సెలవు పెట్టరాదని చెప్పారు. తుపాను షెల్టర్‌లో ఉన్న వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ అధికార యంత్రాగం అప్రమత్తంగా ఉన్నారని, ముందు జాగ్రత్తతో ప్రాణనష్టాన్ని నివారించే చర్యలు చేపడుతున్నామన్నారు. మత్స్యకారులు వేటకు వెళ్లొద్దన్నారు. తుఫాన్ షెల్టర్‌లో ఉన్న వారికి ఆహారం, తాగునీరు, వైద్య సేవలను సకాలంలో అందించాలన్నారు. ఎమ్మెల్యే వెంట అడిషనల్ ఎస్పీ హిమవతి, కావలి డీఎస్పీ వెంకటరమణ పాల్గొన్నారు.



మత్స్యకారులతో మాట్లాడుతున్న ఎస్పీ, ఎమ్మెల్యే

ఆద్యంతం.. భక్తిపారవశ్యం



దీప ప్రకాశనం చేస్తున్న వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి తదితరులు



లక్ష దీపోత్సవంలో పాల్గొన్న భక్తులు

- ముగిసిన కార్తీక లక్ష దీపోత్సవం
- శివకేశవుల నామస్మరణతో తన్మయత్వం
- కార్తీక దీప వెలుగుల్లో ప్రకాశించిన వీఆర్సీ మైదానం

నెల్లూరు(బృందావనం): నగరంలోని వీఆర్సీ ఉన్నత పాఠశాల మైదానంలో మూడో రోజు ఆదివారం కార్తీక లక్ష దీపోత్సవం వైభవోపేతంగా సాగింది. ఓ వైపు వర్షం కురుస్తున్నప్పటికీ ఆద్యంతం భక్తిపారవశ్యంతో భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. రాజ్యసభ సభ్యుడు, వైఎస్ఆర్‌సీపీ జిల్లా అధ్యక్షుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి – ప్రశాంతిరెడ్డి దంపతుల, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సోదరుడు కోటారెడ్డి సౌజన్యంతో వీపీఆర్ ఫౌండేషన్, కార్తీక లక్ష దీపోత్సవ కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం వేడుకగా జరిగింది. కార్తీక లక్ష దీపోత్సవం ముగింపు సందర్భంగా ఆదివారం రాత్రి వీఆర్సీ మైదానానికి విచ్చేసిన కార్యక్రమ నిర్వాహకులు, టీటీడీ ఢిల్లీ స్థానిక సలహామండలి చైర్‌పర్సన్ వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డికి, ప్రముఖ ప్రవచకులు భాగవత భాస్కర బుర్రా భాస్కరశర్మలకు వేదపండితులు పూర్ణకుంభంతో ఆహ్వానం పలికారు. అనంతరం కార్తీక లక్ష దీపోత్సవ ప్రాంగణంలోని ఆకాశదీపాన్ని వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సోదరుడు కోటారెడ్డి దంపతులు, బుర్రా భాస్కరశర్మ వెలిగించారు. అనంతరం శ్రీవైద్యనాథ్ శివలింగానికి, ఉడుపి శ్రీకృష్ణభగవానునికి అభిషేకాలు, పూజలు నిర్వహించారు. తదుపరి భక్తులు కార్తీక దీపాలు వెలిగించారు. ఈ సందర్భంగా బుర్రా భాస్కరశర్మను వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఘనంగా సత్కరించారు. ఉదయం యాగశాలలో విశేష చండీయాగం, 501 మంది దంపతులతో శ్రీవీరవెంకటసత్యనారాయణస్వామి సామూహిక వ్రతం శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం వీపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదం, అన్నప్రసాద వితరణ జరిగింది. తాత్కాలికంగా ప్రతిష్ఠించిన స్ఫటిక శివలింగానికి నమక చమకములతో సంతత ముధక ధారాభిషేకం నిర్వహించారు..



లక్ష దీపోత్సవ కార్యక్రమంలో నృత్య ప్రదర్శన

ఆర్తితో ఆరాధిస్తే పరమేశ్వరానుగ్రహం : భాగవత భాస్కర బుర్రా భాస్కరశర్మ

అజ్ఞానాన్ని తొలగించి జ్ఞానాన్ని అందించే మాసం కార్తీక మాసమని, దివ్యకాంతులు అందించే దీపాన్ని కార్తీక మాసంలో వెలిగించడం ద్వారా అజ్ఞానాంధకారం దూరమై జీవితం ప్రకాశవంతవంతం అవుతుందని భాగవత భాస్కర బుర్రా భాస్కరశర్మ ప్రవచించారు. కార్తీక లక్ష దీపోత్సవంలో భాగంగా 'కార్తీక దీపం వైభవం'పై ఆయన ప్రవచించారు. స్నానం, జ్యోతిప్రజ్వలన, దానధర్మాలకు కార్తీకమాసం ఎంతో విశిష్టమైందన్నారు. శివనామజపంతో జీవుడు మోక్షాన్ని పొందుతాడని, రావణుడు ప్రార్థించినంత ఆర్తిగా పరమేశ్వరుడిని ఆరాధిస్తే శంకరుడు అనుగ్రహిస్తాడని తెలిపారు. గత ఎనిమిదేళ్లుగా కార్తీక లక్ష దీపోత్సవం నిర్వహించడం సాధారణ విషయం కాదన్నారు. భవిష్యత్తులో వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి – ప్రశాంతిరెడ్డి దంపతులు కోటి దీపోత్సవాన్ని నిర్వహించి పార్వతీ పరమేశ్వరుల కృపాకటాక్షాలకు పాత్రులుకావాలన్నారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న వేమిరెడ్డి దంపతులను భాస్కరశర్మ అభినందించారు.



బుర్రా భాస్కరశర్మ ప్రవచనం

వైభవంగా శివపార్వతుల శాంతి కల్యాణం

కార్తీకమాస లక్ష దీపోత్సవం ముగింపు సందర్భంగా ఆదివారం రాత్రి శివపార్వతుల కల్యాణ మహోత్సవాన్ని శ్రీశైలం దేవస్థానం అర్చకుల ఆధ్వర్యంలో కనులపండువగా నిర్వహించారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను చాటుతూ ప్రదర్శితమైన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. వేదపండితులు గట్టుపల్లి పవన్‌కుమార్ శర్మ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వ్యాఖ్యాతలుగా పాటూరి సత్యస్వరూపరాణి, రాధాకృష్ణ దంపతులు వ్యవహరించారు.

క్లుప్తంగా

అందరూ అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న పెంచలయ్య

ఇందుకూరుపేట: తుపాన్ నేపథ్యంలో అందరూ అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌ఓ పెంచలయ్య పేర్కొన్నారు. మండలంలోని జగదేవిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా ఆదివారం తనిఖీ చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. ఆరోగ్య సమస్యలు.. అంటువ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని చెప్పారు. అవసరమైన మందులను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. అత్యవసర సేవలు, మెడికల్ క్యాంపులు తదితరాలపై స్థానిక వైద్యాధికారి కిశోర్‌కుమార్‌ను ఆరాతీశారు. ఏడీఎంహెచ్‌ఓ ఖాదర్‌వలీ, హెల్త్ ఎడ్యుకేటర్ సుధాకర్‌రావు, హెల్త్ సూపర్‌వైజర్ రమా పాల్గొన్నారు.

చేపల వేటకు విరామం



ముత్తుకూరు: మిచాంగ్ తుపాన్ ప్రభావంతో సముద్రం అల్లకల్లోలంగా మారడంతో చేపల వేటకు మత్స్యకారులు విరామం ప్రకటించారు. నాలుగైదు రోజులుగా సముద్రంలో వాతావరణం గంగపుత్రులకు ప్రతికూలంగా మారింది. బోట్లు, వలలను తీరంలో భద్రపర్చి ఇళ్లకే పరిమితమయ్యారు. తుపాన్ ప్రభావంతో అలలు ఉవ్వెత్తున ఎగసిపడుతున్నాయి. నేలటూరు, కృష్ణపట్నం, ఈపూరు గ్రామ మత్స్యకారులను అధికారులు అప్రమత్తం చేశారు.

భక్తిశ్రద్ధలతో సత్యనారాయణ వ్రతం



గూడూరు రూరల్: పట్టణంలోని కటకరాజావీధిలో కొలువైన పాండురంగస్వామి ఆలయంలో సత్యనారాయణస్వామి వ్రతాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో దంపతులు హాజరయ్యారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

అయ్యప్పస్వామికి పడిపూజ



నాయుడుపేట టౌన్: పట్టణంలోని రాఘవేంద్ర భవన్‌లో అయ్యప్పస్వామి పడి పూజోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో ఆదివారం నిర్వహించారు. అయ్యప్ప మాలధారులకు పాదపూజ చేసి దుస్తులను ఆర్యవైశ్య సంఘ జిల్లా రూరల్ అధ్యక్షుడు కనమర్లపూడి సుబ్రహ్మణ్యం, జ్యోతి రాణి, కుటుంబసభ్యుల ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. రమేష్‌బాబు, వెంకటేశ్వరరావు, సురేంద్రనాథ్‌గుప్తా, అనూష, అయ్యప్ప సేవా సంఘ అధ్యక్షుడు కామిరెడ్డి రాజారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ వెంకటకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు రెడ్ కార్పెట్

- టీడీపీలో ఇదీ తంతు
- పార్టీకి ద్వితీయశ్రేణి నేతలంతా బై..బై
- నాయకత్వం వహించే వారే కరువు
- చివరికి రౌడీషీటర్నే మండలాధ్యక్షుడిగా నియమించాల్సిన దుస్థితి



రౌడీషీటర్లకు నిర్వహించిన కౌన్సెలింగ్‌కు హాజరైన రాజాయాదవ్ (ఫైల్)

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: సర్వేపల్లి నియోజకవర్గంలో టీడీపీ పరిస్థితి రోజురోజుకూ దిగజారుతోంది. తాము నమ్ముకున్న నేత నాలుగు సార్లు ఓటమికి గురికావడంతో కార్యకర్తలు నిరాశకు గురవుతున్నారు. సరైన నాయకత్వం లేకపోవడంతో ఆ పార్టీని వీడుతున్నారు. చివరికి పార్టీలో సరైన నేతలు కరువవుతుండటంతో స్థానికంగా ఉండే రౌడీషీటర్లకు ఆ పార్టీ అవకాశం కల్పిస్తోంది. ఎక్కువ కేసులున్న వారికే పార్టీలో క్రియాశీలక పదవులను అప్పగిస్తామని యువగళంలో టీడీపీ నేత లోకేశ్ ప్రకటించడంతో రౌడీషీటర్లు రాజ్యమేలుతున్నారు. ఈ ప్రకటనలు చూసి పార్టీ శ్రేణులు మరింత ఆందోళనకు గురవున్నారు. ఇదే పరిస్థితి పలు నియోజకవర్గాల్లో కొనసాగుతోంది.

క్రమక్రమంగా టీడీపీకి దూరం

సర్వేపల్లి నియోజకవర్గ బాధ్యతలను చూస్తున్న టీడీపీ నేత సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి నాయకత్వంపై నమ్మకం కోల్పోయిన ఆ పార్టీ నేతలు, కార్యకర్తలు క్రమంగా ఆ పార్టీకి దూరమవుతున్నారు. నియోజకవర్గంలో టీడీపీకి గుడ్‌బై చెప్పి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరేవారి సంఖ్య భారీగా పెరుగుతోంది. దీంతో మండల, గ్రామస్థాయిలో టీడీపీకి నాయకత్వం వహించే దిక్కే లేకుండా పోయింది. ఈ తరుణంలో రౌడీషీటర్లుగా గుర్తింపు పొందిన వారిని పార్టీ పదవుల్లో నియమించే దుస్థితికి ఆ పార్టీ దిగజారింది.

రౌడీషీటర్‌కు పదవి..!

టీడీపీలో మండల స్థాయి పదవులను చేపట్టే వారూ కరువయ్యారు. దీంతో ఓ మండలాధ్యక్ష పదవిని ఏకంగా రౌడీషీటర్‌కు కట్టబెట్టారు. గతంలో అనేక కేసుల్లో నేరస్తుడిగా ఉండి.. ప్రస్తుతం రౌడీషీట్ ఉన్న రాజాయాదవ్‌కు ఏకంగా వెంకటాచలం మండలాధ్యక్ష పదవిని అప్పజెప్పారు. ఈయనపై 2010, 2013 కేసులు నమోదయ్యాయి. 2018లో ప్రజలను రూ.ఆరు కోట్ల మేర మోసం చేసిన కేసూ నమోదైంది. పోలీస్‌స్టేషన్లో రౌడీషీటర్లకు నిర్వహించే కౌన్సెలింగ్‌కూ హాజరయ్యారు. దీన్ని బట్టి సర్వేపల్లి నియోజకవర్గంలో టీడీపీ పరిస్థితి ఎంత దిగజారిందో అర్థం చేసుకోవచ్చని పలువురు పేర్కొంటున్నారు.

మంత్రికి పెరుగుతున్న మద్దతు

మంత్రిగా ఉన్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి నాయకత్వానికి నియోజకవర్గ ప్రజలు భారీగా మద్దతు పలుకుతున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించడంతో పాటు నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలను భారీగా చేపడుతుండటంతో మంత్రిపై ప్రజల్లో సానుకూలత వ్యక్తమవుతోంది. ఈ తరుణంలో టీడీపీ నుంచి బయటకొస్తున్న ఆ పార్టీ నేతలు, కార్యకర్తలు మంత్రి సమక్షంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారు.

కనుపూరు కాలువకు నీటి విడుదలకు చర్యలు



మాట్లాడుతున్న ఆదాల ప్రభాకర్‌రెడ్డి

- ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు రూరల్: నెల్లూరు రూరల్ మండలంలోని కనుపూరు కాలువ కింద పంటలను సాగుచేస్తున్న రైతులను ఆదుకునేందుకు ఇరిగేషన్ అధికారులతో చర్చించనున్నామని ఎంపీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. జోరు వర్షాన్ని సైతం లెక్కచేయకుండా ఆమంచర్ల పంచాయతీ పరిధిలోని సేవాజ్యోతి కాలనీ, మట్టెంపాడు, అప్పయ్య కండ్రిగ ప్రాంతాల్లో ఆదివారం ఆయన పర్యటించారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు. కనుపూరు కాలువకు నీటి విడుదల విషయమై ఇరిగేషన్ అధికారులతో సోమవారం చర్చించనున్నామని చెప్పారు. ఆమంచర్ల పంచాయతీ పరిధిలో మౌలిక వసతులను కల్పించనున్నామని చెప్పారు. దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ పథకాలను రాష్ట్రంలో అమలు చేస్తున్నారని తెలిపారు. ప్రజలు తమ ఓటుతో టీడీపీకి బుద్ధి చెప్పాలన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ తమ పార్టీని ఆదరించాలని కోరారు. డీసీసీబీ మాజీ చైర్మన్ ఆనం విజయకుమార్‌రెడ్డి, విజయ డెయిరీ చైర్మన్ రంగారెడ్డి, రూరల్ ఎంపీపీ విజయకుమార్, రూరల్ మండల జేసీఎస్ కన్వీనర్ ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

త్వరితగతిన అభివృద్ధి పనులు పూర్తి



ఆశ్రమ కమిటీ సభ్యులతో చంద్రశేఖర్‌రెడ్డి

- ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి

ఇందుకూరుపేట: పల్లిపాడులోని పినాకినీ సత్యాగ్రహ గాంధీ ఆశ్రమంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్సీ, రెడ్‌క్రాస్ చైర్మన్ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆశ్రమంలో సర్వసభ్య సమావేశాన్ని గణేశం కల్పనమ్మ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆశ్రమంలో వృద్ధాశ్రమ భవన నిర్మాణాన్ని ప్రారంభించాల్సి ఉందని, దీనికి దాతలు సాయం అందించాలని కోరారు. ఆశ్రమానికి సంబంధించిన పలు అంశాలపై కమిటీతో చర్చించారు. ఆశ్రమ కో కన్వీనర్ నెల్లూరు రవీంద్రరెడ్డి, కమిటీ సభ్యులు సుమంత్‌రెడ్డి, దయాకర్‌రెడ్డి, రామిరెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కందికట్టు రాజేశ్వరి, గంటా విజయలక్ష్మి, గంపల మంజుల, అల్లాబక్షు తదితరులు పాల్గొన్నారు.

మిచాంగ్‌ను ఎదుర్కొనేందుకు సిద్ధం

- కలెక్టర్ హరినారాయణన్



మాట్లాడుతున్న హరినారాయణన్

నెల్లూరు (దర్గామిట్ట): మిచాంగ్ తుపాన్‌ను ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగం పూర్తి సన్నద్ధతతో ఉందని కలెక్టర్ హరినారాయణన్ పేర్కొన్నారు. తుపాన్ ప్రభావంపై అధికారులతో ఆదివారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. సచివాలయం, గ్రామ, మండల స్థాయి అధికారులు పనిచేసే చోట అందుబాటులో ఉండాలని కోరారు. తుపాన్ హెచ్చరిక ఈ నెల ఆరు వరకు కొనసాగనున్న తరుణంలో సన్నద్ధ చర్యలను చేపట్టామని వివరించారు. భారీ వర్షాలతో పాటు గాలులు వీచే అవకాశం ఉందని, గుడిసెల్లో ఉండే వారు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని కోరారు. ఈ మూడు రోజుల్లో ప్రసవించనున్న గర్భిణులను ముందుగానే ఆస్పత్రులకు తరలించామని చెప్పారు. అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దని ప్రజలను కోరారు. గుడిసెల్లో ఉండే వారిని పునరావాస కేంద్రాలకు తరలించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. జిల్లాలోని అన్ని ప్రధాన చెరువుల వద్ద పర్యవేక్షణకు అధికారులను నియమించామని వెల్లడించారు.

ఎన్డీఆర్‌ఎఫ్ బృందాలు సిద్ధం

ఎలాంటి ముప్పు ఏర్పడినా ప్రజలను రక్షించేందుకు మూడు ఎన్డీఆర్‌ఎఫ్ బృందాలు సిద్ధంగా ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. కావలిలో ఒకటి, నెల్లూరులో రెండు ఎన్డీఆర్‌ఎఫ్ బృందాలను అందుబాటులో ఉంచామని చెప్పారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా 1077 నంబర్‌ను సంప్రదించాలని కోరారు. జేసీ కూర్మనాథ్, కమిషనర్ వికాస్ మర్మత్, జెడ్పీ సీఈఓ చిరంజీవి, ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యూఎస్, విద్యుత్‌శాఖల ఎస్‌ఈలు కృష్ణమోహన్, రంగవరప్రసాద్, విజయన్, డీపీఓ సుస్మిత పాల్గొన్నారు.

కండలేరులో నీటి నిల్వ

రాపూరు: కండలేరు జలాశయంలో ఆదివారం నాటికి 11.49 టీఎంసీల నీరు నిల్వ ఉందని ఈఈ విజయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. వరదకాలువ నుంచి జలాశయానికి 1200 క్యూసెక్కుల నీరు చేరుతోందని చెప్పారు. హెడ్ రెగ్యులేటర్ నుంచి సత్యసాయి గంగకు 40, పిన్నేరు వాగు, మొదటి బ్రాంచ్ కెనాల్‌కు ఐదు చొప్పున, లోలెవల్ స్లూయిజ్‌కు 135 క్యూసెక్కులను విడుదల చేస్తున్నామని వివరించారు.

నిమ్మ ధరలు



పెద్దవి: రూ.35
సన్నవి: రూ.20
పండ్లు: రూ.6

పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్:	రూ.84
లేయర్	రూ.95
బ్రాయిలర్ చికెన్:	రూ.160
స్కిన్‌లెస్ చికెన్:	రూ.180
లేయర్ చికెన్:	రూ.162

షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: పట్టణంలోని సిండికేట్ బ్యాంక్ వీధిలో గల ఓ ఇంట్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం ఆదివారం చోటుచేసుకుంది. వివరాలు.. సిండికేట్ బ్యాంక్ వీధిలో ఓ ఇంట్లో నరసయ్య అద్దెకు ఉంటున్నారు. ఈ క్రమంలో పాలను అమ్మేందుకు గానూ బయటకెళ్లారు. ఈ తరుణంలో షార్ట్ సర్క్యూట్ సంభవించి ఇంట్లోని వస్తువులు అగ్నికి ఆహుతయ్యాయి. ఇంటిని కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి, రెవెన్యూ అధికారులు పరిశీలించారు.

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు



సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న రామ్‌కుమార్‌రెడ్డి

- నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరి రూరల్: అర్హతే ప్రామాణికంగా ప్రజలకు సంక్షేమ పథకాలను అందిస్తున్న ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, పార్టీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని 10వ వార్డు మనులాలపేటలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. వర్షంలోనే తడుస్తూ ప్రతి ఇంటికీ వెళ్లి వారు పొందిన లబ్ధిని వివరించారు. సమస్యలను తెలుసుకొని పరిష్కారానికి చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. కౌన్సిలర్ శివయ్య, వహీద, సుబ్బారావు, న్యాయవాది కోటేశ్వరరావు, నేతలు చిన్నా, యస్దానీ, తోట గణేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కనులపండువగా మూలస్థానేశ్వరుడి కల్యాణం



నెల్లూరు(బృందావనం): కార్తీక మాసాన్ని పురస్కరించుకొని మూలాపేటలోని భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరస్వామి దేవస్థానంలో స్వామి, అమ్మవారి కల్యాణోత్సవాన్ని నేత్రపర్వంగా ఆదివారం నిర్వహించారు. ఉభయకర్తలుగా మోదం సత్యనారాయణగుప్తా, పూర్ణిమ దంపతులు వ్యవహరించారు.

సోమేశ్వరుడి సేవలో జ్వాలాపురం శ్రీకాంత్



శ్రీకాంత్‌శర్మను సన్మానిస్తున్న బ్రాహ్మణ నేతలు

సోమశిల: అనంతసాగరం మండలం సోమశిలలో వెలసిన కామాక్షి సమేత సోమేశ్వరస్వామి ఆలయాన్ని రాష్ట్ర దేవదాయశాఖ ప్రభుత్వ సలహాదారు జ్వాలాపురం శ్రీకాంత్‌శర్మ ఆదివారం దర్శించుకున్నారు. సోమేశ్వరాలయంలో బ్రాహ్మణ వనభోజన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. సోమేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. 900 ఏళ్ల నాటి ఈ శివాలయం వరదలకు దెబ్బతినడం బాధాకరమని, దేవదాయశాఖ సీజీఎఫ్ నిధులను ఆలయానికి మంజూరు చేయిస్తానని తెలిపారు. అమ్మవారి ఆలయాన్ని త్వరలో పునర్నిర్మిస్తామన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి సోమశిల శివాలయానికి పూర్వవైభవం తీసుకొచ్చేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్తలు ఉప్పల సోమసుందరమూర్తి, ఉప్పల విజయకుమార్, సోమశిల ఈఓ ప్రసాద్, అర్చకులు శశి కళాధర్‌శర్మ, ఈదురు సంపతాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఇబ్బందులకు చెక్

- పొదలకూరు ప్రజలకు పుష్కలంగా నీరు
- జలజీవన్ మిషన్లో ప్రత్యేక పైప్‌లైన్
- రూ.3.93 కోట్లతో టెండర్ల ప్రక్రియ పూర్తి
- కండలేరు నుంచి ప్రత్యేకంగా నిర్మాణం
- మంత్రి కాకాణి చొరవతో పనులు



రాపూరు మార్గంలో పైప్‌లైన్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఏఈ తదితరులు (ఫైల్)

పొదలకూరు: గ్రామీణ ప్రాంతాలతో పాటు పట్టణంలో తాగునీటి ఇబ్బందులకు స్వస్తి పలికి పుష్కలంగా అందించేందుకు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి చర్యలు చేపట్టారు. ఎన్నో ఏళ్లుగా పొదలకూరు పట్టణ వాసులు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. చాలా వరకు సమస్యను పరిష్కరించినా తాగునీటిని నిత్యం అందించలేకపోతున్నారు. ఈ క్రమంలో జలజీవన్ మిషన్ ద్వారా రూ.3.93 కోట్లతో కండలేరు నుంచి ప్రత్యేక పైప్‌లైన్‌ను నిర్మించి పొదలకూరు పట్టణ వాసులకు నిత్యం అందించేందుకు మంత్రి కృషి చేస్తున్నారు. ఈ నేపథ్యంలో పనులకు సంబంధించిన టెండర్ల ప్రక్రియ పూర్తయింది. పనులను చేపట్టేందుకు గానూ సంబంధిత కాంట్రాక్టర్ అధికారులతో కలిసి పరిశీలించారు. జలజీవన్ మిషన్లో భాగంగా మండలంలో ఇంటింటికీ తాగునీటి కుళాయిను ఏర్పాటు చేసేందుకు నిధులను మంజూరు చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో విడుదలయ్యే నిధులతో తాగునీటి ఇబ్బందులను పరిష్కరించనున్నారు. వేసవిలో సైతం గ్రామీణ ప్రాంతాల ప్రజలు ఇబ్బందులు పడకుండా చర్యలు చేపట్టనున్నారు.

మండలానికి రూ.17.39 కోట్లు

మండలంలో జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ కుళాయి కనెక్షన్‌ను బిగించి తాగునీటిని అందించేందుకు రూ.17.39 కోట్లను మంజూరు చేశారు. అవసరమైన చోట రక్షిత మంచినీటి ట్యాంకులతో పాటు పైప్‌లైన్‌ను నిర్మించి కుళాయిలను ఏర్పాటు చేయనున్నారు. ఒక్క పొదలకూరు పట్టణ తాగునీటి అవసరాల కోసమే జలజీవన్ మిషన్లో రెండు విడతలుగా రూ.2.42 కోట్లు, రూ.1.51 కోట్లను మంజూరు చేశారు. పనులను ప్రారంభించేందుకు పైపులను దిగుమతి చేసుకుంటున్నారు. కండలేరు జలాలను రాపూరు మార్గంలోని ప్రత్యేక పైప్‌లైన్ ద్వారా పట్టణానికి అందించనున్నారు. ఈ పైప్‌లైన్ నుంచి మర్రిపల్లి (దిగువ) గ్రామానికి సరఫరా చేసేందుకు ఓవర్ హెడ్ ట్యాంక్‌ను నిర్మించనున్నారు.

మండలంలో 34 గ్రామాల ఎంపిక

ఫిల్లింగ్ హౌస్‌హోల్డ్ ట్యాప్ కనెక్షన్ ద్వారా ప్రతి ఇంటికీ ఉచితంగా మంచినీటి కుళాయిను బిగిస్తారు. దీనికి గానూ జలజీవన్ మిషన్లో భాగంగా 2020లోనే మండలంలో 34 గ్రామాలను ఎంపిక చేశారు. 27 పనులకు సంబంధించిన టెండర్ల ప్రక్రియను పూర్తి చేశారు. మిగిలిన పనులకు టెండర్లను నిర్వహించే పనిలో ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ అధికారులు ఉన్నారు. ఈ ప్రక్రియ పూర్తయితే అవసరమైన గ్రామాల్లో రక్షిత మంచినీటి ట్యాంకులను సైతం నిర్మించనున్నారు.

పొదలకూరుకు నిత్యం మంచినీరు



ప్రత్యేక పైప్‌లైన్ పనులు పూర్తయ్యాక గుర్రాప్ప బావి నుంచి పట్టణ ప్రజలకు నిత్యం పుష్కలంగా మంచినీటిని అందించనున్నాం. త్వరలో పనులను చేపట్టనున్నారు. ప్రత్యేక పైప్‌లైన్ ద్వారా మర్రిపల్లికి మంచినీటిని సరఫరా చేయనున్నాం. ఎంపిక చేసిన గ్రామాల్లో ఇంటింటికీ కుళాయి కనెక్షన్‌ను అందజేసి స్వచ్ఛమైన తాగునీటిని సరఫరా చేస్తాం.

– కసనానాయక్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, పొదలకూరు